# నగరంలో చెట్టు

వారాల ఆనంద్

అడవినీ తన వాళ్ళనీ వదిలి
కొమ్మల్ని చేతుల్లా వూపుతూ
ఆకుల్ని గలగలాడిస్తూ
ఓ చెట్టు నగరంలోకొచ్చింది

అన్నీ నగరాల్లాగే ఆ నగరానికీ
ఓ మరుగున పడ్డ చరిత్ర వుంది
పుంజుకుంటున్న ఆధునికతా వుంది

విశాలమయిన రహదారులూ
ప్రవాహంలా సాగే వాహనాలూ
సంగీతంలో లయగా సాగే ఫ్లై ఓవర్లు

గత చరిత్ర ఆనవాళ్ళయిన
కోటలూ కూలిన గోడలూ
ఆకాశహర్మ్యాలూ మెట్రోలూ ఎయిర్ పోర్టులూ
అన్నింటినీ చూస్తూ
చెట్టు మహా సంబరపడింది

ఇన్నేళ్లూ సూర్యుడి ఎండనీ
చంద్రుడి వెన్నెలనీ చూసిన చెట్టు
రంగు రంగుల కాంతి పుంజాలూ,
మిణుకు మిణుకు మంటున్న బల్బుల్నీ చూసి
ఆశ్చర్యంతో ఒక చోట నిలబడింది

పక్కనే వున్న దుకాణాదారు
షాపుకడ్డంగా నీకిక్కడేంపని అన్నాడు
ఉలిక్కి పడ్డ చెట్టు నాలుగు అడుగులు ముందుకేసింది

చౌరాస్తా చేరిన చెట్టుని చూసి
దారికడ్డంగా ఈ చెట్టేమిటి
మున్సిపల్ వాళ్ళకు బుద్ధి లేదు కొట్టి పడేయక
అన్నారెవరో

భయమేసిన చెట్టు మరింత ముదుకు సాగింది

అక్కడేవో పచ్చని మొక్కల్ని చూసి నిలబడిపోయింది
ఎవడో చెట్టుమీద చెయ్యేసి తోస్తూ
అవన్నీ కుండీల్లోనూ మిద్దెలమీదా పెంచేవి
నీకిక్కడ స్థానం లేదుపో అన్నాడు

భయం భయంగా ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని
బతుకుజీవుడా అనుకుంటూ
చెట్టు అడవిలోకి
తన వాళ్ళ చెంతకే చేరింది

------

# వక్రము లేనిది ప్రకృతి

అయ్యగారి లక్ష్మణరావు

కవిత్వమొక తీరని దాహం
నా ప్రపంచమే గీతా సారం

నెలలు నెలలుగ నేల తల్లి
క్రమము వీడక తిరుగునట్లే
ఆగకుండగ కాలచక్రము
ఆది నుంచీ సాగునట్లే

నెలలు నిండిన గర్భ శిశువుకు
కర్మ రీతిగ పునర్జన్మము
వయసు మీరిన వయసు వారికి
ఆపకుండగ శ్వాస విడుపును
కలగ చేసెను మాయ జాలము

పుట్టు గిట్టుల మధ్య కొలతని
పెంచమంటూ ఎందుకోయీ
అంత సేపూ వింత ధోరణి
చావ బోయే  చమత్కారీ

ఇంత సేపూ చేసినంత
స్వంత గొప్పను నెమరు వేస్తూ
మరో మెట్టూ ఎక్కడానికి

మొక్కు కుంటూ శ్రమని చేస్తూ
కర్మ యోగం కిటుకు వీడి
చివరి శ్వాసకు దగ్గరవుతూ

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

రండు రండు గృహముల ద్వారములు తెరచి
ఆరుబయట సౌందర్యమ్మునరయ రండు
ప్రణయ గీతాలనెలుగెత్తి పాడ రండు
ఎదను దాగిన ముదము చాటింప రండు

ప్రేమ పదములు పాడుదు వినగ రండు
కలిసి నా తోడ గళములు కలప రండు
చేరి నా తోడ నాట్యమ్ము చేయ రండు
వసుధకెల్లను ప్రేమను పంచ రండు

కనుల నైరాశ్యమునకిది క్షణము కాదు
చింతలను వెనుకకు నెట్టి చేర రండు
బాష్పములనెల్ల లోపల వదలి రండు
హసనముఖులై యిచట నాట్యమాడ రండు

వింత రంగుల ప్రకృతి శోభిల్లునిచట
దృష్టికడ్డైన గోడలు మృగ్యమిచట
హృదయమెల్లను పరితోషమెగయునిచట
పొసగునెడదకు దివ్యానుభూతి యిచట

నీరదమ! కరుణాంబువుల్ నింపుమిచట
మారుతమ! శీతలస్పర్శ మాకొసంగు
ఆకసమ! ఛత్రమై కావుమనవరతము
భూతలమ! మాతృమూర్తివై ప్రోచు మమ్ము

COMMENTS